



శ్రీకాకుళంలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ఓటెత్తిన ఉపాధ్యాయులు

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో
- 92.4 శాతం పోలింగ్
- అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 96 శాతం
- అతి తక్కువగా విశాఖ జిల్లాలో 87.34 శాతం



శ్రీకాకుళంలో బారులుదీరిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదైంది. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా, 20,783 మంది (92.4 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 13,508 మందికి 12,557 మంది, మహిళలు 8,985 మందికి 8,226 మంది ఓటు వేశారు. అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 2,885కి 2,776 (96.22 శాతం) మంది ఓటు వేయగా, అతి తక్కువగా విశాఖ జిల్లాలో 5529కి 4,829 మంది (87.34 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 5,035కి 4,769 (94.72 శాతం), పార్వతీపురం మన్యంలో 2,333కి 2,187 (93.74 శాతం), విజయనగరం జిల్లాలో 5,223కి 3,912 (94.05 శాతం), అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,488కి 1,310 (88.04 శాతం) మంది ఓటు వేశారు. ఆరు జిల్లాల పరిధిలో ఉదయం పది గంటలకల్లా 21.74 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 57.71 శాతం, రెండు గంటలకు 79.54 శాతం ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసేసరికి 92.4 శాతానికి చేరింది. ఆరు జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ జరిగింది. ఈ పర్యాయం 2.4 శాతం ఎక్కువగా ఓట్లు పోలైనట్టు అధికారులు చెబుతున్నారు. అలాగే అభ్యర్థులు పాకలపాటి రఘువర్మ శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం.., గాదె శ్రీనివాసులనాయుడు విజయనగరం, అనకాపల్లి.., కోరెడ్ల విజయగౌరి విజయనగరం జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.



పోలింగ్ కేంద్రం వద్ద భద్రతను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సిక్కోలులో పోలింగ్ 94.72 శాతం

శ్రీకాకుళం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక శ్రీకాకుళం జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా 31 కేంద్రాల్లో 94.72శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రక్రియ మందకొడిగా ఆరంభమైనా.. సాయంత్రం నాటికి పుంజుకొంది. మొత్తం 5,035 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 4,769 మంది గురువులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలాస డివిజన్‌లో 1,061 మంది(96.11 శాతం), టెక్కలి డివిజన్‌లో 1,008 మంది(95.73 శాతం), శ్రీకాకుళం డివిజన్‌లో 2700 మంది (93.82 శాతం)ఓటు వేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. సుమారు 300 మంది పోలీసులు బందోబస్తు కల్పించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల కోసం పోలింగ్ సిబ్బంది సహకరించారు. అలాగే పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా శిబిరాలు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళంలో ఎన్టీఆర్ ఎంహెచ్ హైస్కూల్‌కు కొంత దూరంలో అభ్యర్థుల వారీగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా టీడీపీ నాయకులు, కార్యకర్తలు శిబిరాల్లో కూర్చొన్నారు. అలాగే అభ్యర్థులు జిల్లాలో పలుచోట్ల పోలింగ్‌ను పరిశీలించారు.

మా భూములకు నీరందడం లేదు 8లో
- రోడ్డుకు అడ్డంగా బైక్‌లు పెట్టి రైతుల నిరసన



ఎండలమల్లన్నకు విభూది అభిషేకం

టెక్కలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండల మల్లికార్జునస్వామికి మహాశివరాత్రి అనంతరం గురువారం అర్చకులు విభూది అభిషేకం నిర్వహించారు. స్వయంభూ అనంతరం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఈవో గురునాథరావు పర్యవేక్షణలో అర్చకులు మూడుగంటల పాటు అభిషేకం చేపట్టారు. శివరాత్రి సందర్భంగా రూ.9,23,332 ఆదాయం లభించిందని ఈవో తెలిపారు. శీర్షాభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.2.94 లక్షలు, శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1.96 లక్షలు, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.12వేలు, హుండీల నుంచి రూ.4.20 లక్షలు లభించిందన్నారు. గత ఏడాది కన్నా రూ.2.54 లక్షలు పెరిగినట్టు చెప్పారు.

అనాలోచిత నిర్ణయం.. ప్రజల పాలిట శాపం 8లో
- నివగాం ఆర్టీసీ బస్ స్టేషన్ మూసివేతతో ఇక్కట్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటప్పారావు

ఒడిశా టు కేరళ

- గంజాయి రవాణాకు యత్నం
- 47.480 కిలోల స్వాధీనం
- ఆరుగురు అరెస్టు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఇచ్ఛాపురం మీదుగా కేరళ రాష్ట్రానికి తరలిస్తున్న 47.480కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని.. ఆరుగురిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సర్కిల్ కార్యాలయంలో కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు విలేకరులకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గోవింద్‌పూర్ పరిధి జారో పంచాయతీకి చెందిన మిఖిల్ సబర్, సుఖంత్ సబర్, టొటా గొమాంగో, బాబులా గొమాంగో, రఘునాథ్‌పూర్‌కు చెందిన సుమంతా సబర్, గంజాం జిల్లా సింగిపూర్ గ్రామానికి చెందిన ప్రకాష్ గొమాంగో.. ఒడిశాలోని మోహన్‌బ్లాక్‌లో 47.480కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దానిని ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు రైలులో తరలించాలని భావించారు. ఈ మేరకు గురువారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు ఆ ఆరుగురు చేరుకోగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. గంజాయతోపాటు ఏడు ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ చిన్నమనాయుడు, ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా.. నో ఎంట్రీ



- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- 75 కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు
- హాల్‌టిక్కెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పర్లేదు

నరసన్నపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. 22,789 మంది ప్రథమ, 17,567 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 40,356 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ మేరకు 75 కేంద్రాల్లో పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయి. 8.30 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో దుర్గారావు తెలిపారు.

- చూసిరాతలు, ఇతర అవకతవకలకు చెక్ పెట్టేందుకు అధికారులు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం ఆర్ఐవో కార్యాలయం, విజయవాడలోని ఇంటర్మీడియట్ బోర్డు ప్రధాన కార్యాలయానికి సీసీ కెమెరాలు అనుసంధానం చేశారు. ఆ కార్యాలయాల నుంచి కూడా పరీక్షా కేంద్రాల్లో ఏమి జరుగుతుందో పర్యవేక్షించనున్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు 75 మంది చీఫ్‌లు, 75 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు 1,642 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కేంద్రాల్లో కాపీయింగ్ నిరోధించేందుకు మూడేసి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఆర్ఐవో, డీఈసీ సభ్యులు, ప్రత్యేకాధికారులు, కలెక్టర్, రెవెన్యూ అధికారులు, రాష్ట్రస్థాయి బోర్డు అధికారులు కూడా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు.

హాల్‌టిక్కెట్లు మరింత సులభతరం..

విద్యార్థులు ఈసారి హాల్‌టిక్కెట్లు సులభతరంగా పొందనున్నారు. వారు చదువుతున్న కళాశాలల నుంచి వీటిని పొందవచ్చు. నేరుగా వాట్సాప్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థి చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో సంబంధం లేకుండా పరీక్షకు హాజరుకావచ్చు. విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తే కళాశాలల యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకుంటామని ఆర్ఐవో దుర్గారావు హెచ్చరించారు.

సెల్‌ఫోన్లు నిషేధం..

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజలేటర్లు, పోలీసు, వైద్యసిబ్బంది, స్క్వాడ్ అధికారులు, ఇతర సిబ్బంది ఎవ్వరూ సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్షల విధులు నిర్వహించే సిబ్బంది వద్ద తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ఉండాలి. పరీక్షల సమాచారం అందించేందుకు ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోలు రూమ్‌ను ఏర్పాటు చేశారు. దానికి 08942-295933 నెంబర్‌ను కేటాయించారు.

సూచనలివీ..

- విద్యార్థులు నిర్ణీత సమయానికి అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షా కేంద్రంలో ఉండాల్సిందే. 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌లో (మిగతా 8వ పేజీలో..)

టెక్కలి సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

- అడ్డగోలు రిజిస్ట్రేషన్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- గతంలో పలాసలోనూ వేటు



ఉమామహేశ్వరరావు

టెక్కలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టెక్కలి సబ్ రిజిస్ట్రార్ ఎం.ఉమా మహేశ్వరరావును సస్పెండ్ చేస్తూ గురువారం విజయనగరం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎ.నాగలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల టెక్కలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోంది. దీనిపై గత నెల 29న 'టెక్కలిలోనే ఎక్కువగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. సబ్‌రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు ఎనీవేర్ రిజిస్ట్రేషన్లతోపాటు ఇళ్ల కాలనీల పొజిషన్ సర్టిఫికెట్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టెక్కలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్పెషల్ పవర్ ఆఫ్ ఆటార్నీ సక్రమంగా వినియోగించకుండా తప్పిదాలకు పాల్పడ్డారనే విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే సక్రమంగా లేని డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని విశాఖకు చెందిన నల్లకోర్ల సరోజాదేవి ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి.. అడ్డగోలు రిజిస్ట్రేషన్లు వాస్తవమేనని నిర్ధారించారు. సబ్‌రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావును సస్పెండ్ చేశారు. కాగా.. గతంలో పలాస సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలోనూ ఈయన సస్పెండ్ అయ్యారు. తాజాగా రెండోసారి కూడా సస్పెండ్ చేయడంతో.. ఉమామహేశ్వరరావు అవినీతికి అధికారులు చెక్ పెట్టినట్లయింది.



మిరియాపల్లి రేవులో ఏర్పాటు చేసిన బారికేడ్లు



నంది వాహనం

నేడు శ్రీముఖలింగేశ్వరుడికి చక్రతీర్థ స్నానం

- నంది వాహనాన్ని సిద్ధం చేసిన అర్చకులు
- లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం

జలుమూరు/ ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగం మహాశివరాత్రి ఉత్సవాల చివరి రోజు శుక్రవారం వంశధార నదిలో స్వామివారి చక్రతీర్థ స్నానాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకోసం అర్చకులు నందివాహనాన్ని కూడా సిద్ధం చేశారు. పాడ్యమి గడియలు తగలగానే 12.30 గంటలకు ఉత్సవ మూర్తులకు నూతనవస్త్రాలు ధరింపజేసి పూలమాలలతో అలంకరించి నందివాహనంపై ఆశీనుల చేస్తామని ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ముందుగా శ్రీకాకుళం ఆర్డీవో కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవం ప్రారంభిస్తారన్నారు. అనంతరం వంశధారనదికి తీసుకెళ్లి అక్కడ స్నానాలు ఆచరించి తిరిగి స్వామివారిని యథాస్థానానికి చేరుస్తామన్నారు. లక్షలాది మంది భక్తులు కూడా నదిలో స్నానాలు ఆచరిస్తారు.

- చక్రతీర్థ స్నానాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు టెక్కలి డీఎస్పీ మూర్తి తెలిపారు. బారికేడ్లను ఆయన గురువారం పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ స్వామి నందివాహనంపై వంశధారనదికి వెళ్లేటప్పుడు నాలుగు వరుసల బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదనంగా నాలుగు రోప్‌పార్టీలను కూడా నియమించినట్లు తెలిపారు. అలాగే ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లి సమీపంలోని వంశధార నదిలో కూడా బారికేడ్లు ఏర్పాటు చేశామని, 300మంది పోలీసు బందోబస్తు సిద్ధం చేశామని ఆమ దాలవలస సీఐ సత్యనారాయణ తెలిపారు. ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి ఎస్ఐ హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

చక్రతీర్థ స్నానాలకు నీటి విడుదల

హిరమండలం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలకు గొట్టాబ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం వంశధార అధికారులు నీటిని విడుదల చేశారు. స్నానఘట్టానికి లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో 8వగేటు ఎత్తి 100 క్యూసెక్కులు విడిచిపెట్టారు. పరివాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తక్కువగా ఉండడంతో అంతకంటే ఎక్కువ నీటిని విడిచిపెట్టేందుకు అవకాశం లేదని అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి బ్యారేజీ వద్ద 35.68 మీటర్ల నీటిమట్టం ఉండగా 30 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో ఉంది.

పోలింగ్ ప్రశాంతం

● ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటేసిన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


సోంపేట: నడవలేని స్థితిలో ఓటేసేందుకు వస్తున్న ఉపాధ్యాయుడు


టెక్కలి: పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు


ఓటేసిన దివ్యాంగ ఉపాధ్యాయుడు


ఆమదాలవలస: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పుండ్కర్


నరసన్నపేట: పోలీసుల సాయంతో ఓటేసేందుకు వస్తున్న దివ్యాంగ ఉపాధ్యాయుడు నర్సింగరావు


జలుమూరు: ఓటింగ్ సరళి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తి


జి.సిగడాం: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


పొందూరు: పరిశీలనకు వచ్చిన విజయనగరం ఎంపీ కలిశెట్టి


బూర్జ: కూటమి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్


రణస్థలం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ


పాతపట్నం: ఉపాధ్యాయ సంఘాల శిబిరంలో ఎమ్మెల్యే గోవిందరావు


పలాస: శిబిరంలో కూటమి నేతలు


శ్రీకాకుళం: ఓటరు స్లిప్పులు అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33/11 కేవీ ఆమదాలవలస సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగింపులో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మెట్టక్కివలస, అమ్మానగర్, కుప్పిలి వారివీధి, ఊసవానిపేట, అలమాజీపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. అలాగే సరుబుజ్జిలి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మ ర్రిపాడు, కొత్తకోట, కొండ్రగూడ, వెన్నెలవలస, సుభద్రాపురం, రొట్టవలస, కొండవలస, రావివలస, పాలవలస, వెంకటాపురం, పాలెం, పురుషోత్తపురం తదితర గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

● జి.సిగడాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బాతువ విద్యుత్ ఉపకేంద్రంలో 33/11 కేవీ మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు శ్రీకాకుళం విద్యుత్ శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. డీఆర్ వలస, సర్వేశ్వరపురం, పున్నాం, మునినివలస, ఉల్లివలస, రౌతుపేట, బాతువ తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్న కారణంగా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


చెక్కు అందిస్తున్న దాతలు

అరసవల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని గార మండలం వాడపల్లి గ్రామానికి చెందిన పప్పు గోవిందరావు, జ్యోతి గురువారం దర్శించుకున్నారు. తమ కుమార్తె సుశీల జ్ఞాపకార్థం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజుకు అందజేశారు. అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించగా స్వామి వారికి జ్ఞాపికను అందజేశారు.

రామయ్య తండ్రి సంబరాలు

జి.సిగడాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో గురువారం రామయ్య తండ్రి సంబరాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తప్పెట గుళ్ల, మేళతాళాల నడుమ ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఉత్సవాల్లో సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్‌యాత్ర


సైకిల్‌యాత్ర చేస్తున్న చౌదరి

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం రాజస్థాన్‌కు చెందిన 24 ఏళ్ల వయసు గల యువకుడు నానుపప్పు చౌదరి సైకిల్ యాత్ర చేపట్టారు. రాజస్థాన్ రాష్ట్రం నాగోర్ జిల్లా ఖిన్సర్ గ్రామానికి చెందిన చౌదరి.. రోటరీ క్లబ్ సభ్యుడిగా ఉంటూ 22 నెలల కిందట దేశంవ్యాప్తంగా పర్యటించి పర్యావరణ ఆవశ్యకతను వివరించేందుకు సైకిల్ యాత్ర ప్రారంభించాడు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు, అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు. దాదాపు లక్ష మొక్కలు నాటడం, హిమాలయాల్లో ఎవరెస్టు శిఖరం వరకు వెళ్లి జాతీయ జెండాను ఆవిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతానికి 17 రాష్ట్రాల్లో 33 వేల కిలోమీటర్లు సైకిల్‌యాత్ర పూర్తయిందని, మిగతా 11 రాష్ట్రాల్లో 27 వేల కిలోమీటర్లు ప్రయాణించనున్నట్టు తెలిపారు. మొత్తం 60వేలు కిలోమీటర్ల మేరా సైకిల్‌పై ప్రయాణించి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. పగటిపూట మాత్రమే ప్రయాణిస్తూ.. రాత్రిపూట రోటరీ క్లబ్స్, ఆలయాల వద్ద సేదతీరుతున్నట్టు స్పష్టం చేశారు. గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్న చౌదరితో సెల్ఫీలు దిగేందుకు పలువురు ఆసక్తి చూపారు.

ఘనంగా ఉమా జఠలేశ్వర స్వామి కల్యాణం


లింగోద్భవ దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా గురువారం నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వర స్వామి కల్యాణం అర్చకులు బి.అశ్వినీకుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి 100 కిలోల బియ్యంతో లింగోద్భవం నిర్వహించారు. ఆ బియ్యాన్ని అన్న ప్రసాదంలో వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే బలగలో నాగావళి నది ఒడ్డున ఉన్న కాలభైరవ స్వామి ఆలయం వద్ద మహాశివలింగాన్ని ఏర్పాటు చేసి లింగోద్భవ సమయంలో భక్తులు తెచ్చి వెయ్యి లీటర్ల పాలు, పసుపు కుంకుమ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. మొండేటివారి వీధిలో శివకా మేశ్వరి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

థర్మల్ ప్లాంట్‌పై ఆందోళన వద్దు


వెన్నెలవలస వద్ద పరిశీలిస్తున్న జనార్దనరావు

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస వద్ద ఏర్పాటు కానున్న థర్మల్ విద్యుత్ పవర్‌ప్లాంట్ నిర్మాణాలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రిటైర్డు రెవెన్యూ ఉద్యోగుల సంఘం సహాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పేడాడ జనార్దనరావు అన్నారు. గురువారం ఆయన సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస, పరిసర గ్రామాలను సందర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంటేషన్ నిర్మాణం వల్ల స్థానికులకు ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం రెండింతలు ఇస్తుందని, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. అసైన్డ్ భూములకు కూడా నష్టపరిహారం మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. పవర్ ప్లాంటేషన్ పరిధిలో 30 గ్రామాలు ఉండడంతో సుమారు 1500 మంది కుటుంబాలతో వారి జీవన మనుగడకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈయనతో పాటు మున్సిపల్ ఛైర్మన్ కూన అప్పలనాయుడు, టీడీపీ నాయకులు సీపాన వెంకటరావు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠకు ఆహ్వానం

కవిటి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చంద్రశేఖరస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన ఆలయ మండప, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాల్సిందిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కవిటి గ్రామస్థులు కోరారు. వచ్చే నెల 9న శివాలయం వద్ద మండపతోపాటు వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, తులసికోట ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ మేరకు రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి ఆహ్వానాన్ని అందించారు. కార్యక్రమంలో కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావుతోపాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బ్రిడ్జిలు నిర్మించాలని వినతి


రైల్వే అధికారులకు సమస్య వివరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు ఎంతో అవసరమైన ఆర్వో బ్రిడ్జి (రోడ్ ఓవర్ బ్రిడ్జి), ఆర్‌యూబీ (రోడ్ అండర్ బ్రిడ్జి) నిర్మాణం చేపట్టాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాష్ కోరారు. ఈ మేరకు గురువారం ఖుర్దా డివిజనల్ ఇంజనీర్ అభిషేక్ కుమార్ (ఖుర్దా)తోపాటు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జోష్‌ను భువనేశ్వర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. పాతాళసిద్ధేశ్వర ఆలయం రోడ్‌లో, కొళిగాం రోడ్‌లో ఆర్ఓబీ, ఆర్‌యూబీ (రోడ్ ఓవర్ బ్రిడ్జి)ని నిర్మించాలని కోరారు వీటితో పాటు ప్రధాన రైళ్ల ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని కోరారు. ఈయనతోపాటు చక్కా గోపి, వి.రాజు, జనార్దనరావు ఉన్నారు.

నేడు చక్రతీర్థ స్నానాలు

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురంలో ఉన్న ఉమా కామేశ్వరస్వామి వారి చక్రతీర్థ స్నానాలు శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా శివరాత్రి ఉత్సవాలకు ఉమా కామేశ్వరస్వామికి వంశధార నదిలో భక్తజన సందోహం నడుమ చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శంకర్

గార, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పూసర్లపాడు గ్రామంలో వచ్చే నెల 4వ తేదీన జరుగనున్న గ్రామ దేవత అసిరితల్లి పండుగ సందర్భంగా గురువారం సాయంత్రం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ పండగలో సిరిమానోత్సవం ఎంతో విశేషమైనదని, ఈ ఉత్సవం విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

కంచిలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీఎల్‌పీవో ఆర్.గోపిబాల గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన అన్నిరకాల పన్నులు మార్చిలోగా వసూలు చేయాలన్నారు.

● గార, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చెత్త సంపద కేంద్రాలను మెరుగుపర్చాలని డీపీవో భారతీ సౌజన్య అన్నారు. బూరవెల్లిలో గురువారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఈవోపీఆర్డీ కూర్మారావు మాట్లాడుతూ.. మండలంలో 18 చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి 29వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎన్.వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పరిధిలో బాలురు, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలు, స్వర్ణభారతి జూనియర్ కళాశాల, ఆదిత్య జూనియర్ కళాశాల(ఎం.తోటూరు)ల్లో జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం రాత్రి శ్రీకాకుళం నగరంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. విశాఖకి చెందిన మైలపిల్లి కోదండరావు(35) కొన్నాళ్లగా శ్రీకాకుళంలోని దమ్మలవీధిలో ఉన్న అతడి బావ కోడ నరేంద్ర వద్ద ఉంటూ ఓ పండ్ల దుకాణంలో పనిచేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. ఇతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల వల్ల వారంతా కోదండరావుకు దూరంగా ఉంటున్నారు. దీంతో మద్యానికి బానిసైన కోదండరావు కొద్ది రోజులుగా ఆరోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. పందుంపుళ్ల జంక్షన్‌లో కళ్లు తిరిగి పడిపోయాడు. అక్కడివారు సపర్యలు చేసి పంపించగా కాస్త దూరం వెళ్లి పడిపోయి మృతి చెందాడు. కోదండరావుకు ఫిట్స్ ఉండేదని అందువల్లే పడి చనిపోయుంటాడని అతడి బావ నరేంద్ర వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్టు ఎస్ఐ హరకృష్ణ తెలిపారు.













వేసవిలో నీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించండి

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎండలు పెరుగుతున్నందున వేసవిలో నీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం సంబంధిత అధికారులతో ఆయన గురువారం ఫోన్‌లో మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పాడైన రక్షిత నీటి పథ కాలకు మరమ్మతులు చేయించాలన్నారు. ప్రధానంగా ఉద్దాన ప్రాంతానికి తాగునీరు అంది స్తున్న ప్రధాన రక్షిత నీటి పథకం పనితీరును మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇతర మండలాల్లో ఉన్న రక్షిత నీటి పథకాలు, పనితీరుపై నివేదిక ఇవ్వాలని, బోర్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు నిధుల కొరత లేదని ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

అనాలోచిత నిర్ణయం.. ప్రజల పాలిట శాపం

● నివగాం ఆర్టీసీ బస్ స్టేషన్ మూసివేత
● రోడ్డుపై పడిగాపులు పడుతున్న ప్రయాణికులు

కొత్తూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఒక పక్క అధికారులు ప్రకటనలు చేస్తూ మరోపక్క వారికి ఉన్న అవకాశాలను తొలగిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు గాను నివగాంలో 1995లో అప్పటి ఆర్టీసీ జోనల్ చైర్మన్ కలమట మోహనరావు కృషితో బస్ స్టేషన్ నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి ఆంధ్ర, ఒడిశా ప్రయాణికులు వివిధ ప్రాంతాల కు ఇక్కడి నుంచే ప్రయాణాలు చేస్తున్నారు. గంటల తరబడి వేచి ఉండాల్సి ఉన్నా అక్కడే ఉండి బస్సులు ఎక్కే వారు. అయితే ఇటీవల ఆర్టీసీ అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ప్రయాణికులు నిలువనీడ కోల్పోయారు. 2024 మేలో పదేళ్ల (2034 వరకు) ప్రైవేటు వ్యక్తికి లీజుకు ఇచ్చేయడంతో బస్ స్టేషన్‌ను పూర్తిగా మూసి వేశారు. దీంతో ప్రయాణికులు నిలువనీడ లేక రోడ్డుపై బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆర్టీసీకి ఆదాయం పెంపొందించేందుకు మరో ప్రత్యామ్నాయమార్గం చూడాల్సిన అధికారులు ఇలా చేయడం ఏమిటని పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. లీజు రద్దు చేసి ప్రయాణికులకు విశ్రాంతి భవనంగా ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాలు, ప్రజలు ఆందోళనలు చేసినా అధికారుల్లో చలనం కనిపించలేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని వారు కోరుతున్నారు.



బస్సు స్టేషన్‌ను గోదాంగా మార్చి తాళాలు వేయడంతో బయట వేచి ఉన్న ప్రయాణికులు

బిన్ ఫ్రీ మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గను బిన్ ఫ్రీ మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది కృషి చేయాలని కమిషనర్ ఎన్.రామారావు ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాలను ఆరోగ్యకరంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కలిగించారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిలను నెలాఖరులోగా వసూలు చేయాలని, ఎంఎస్‌ఎంఈ సర్వేని సక్రమంగా నిర్వహించాలన్నారు. రోడ్లపై పశువులు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణం చర్యలు తీసుకుని పశువుల యజమానులకు హెచ్చరించాలన్నారు. ఖాళీ స్థలాల్లో గోడలపై అందమైన పెయింటింగ్స్ వేయాల్సి ఉందని, దీన్ని త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకువద్దామని, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కల క్లియరెన్స్ చేపట్టాలన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలులోకి తీసుకు రావాలని సూచించారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న అంబులెన్స్

● భర్త దుర్మరణం.. భార్యకు తీవ్రగాయాలు



జాతీయ రహదారిపై జరిగిన ప్రమాద దృశ్యం

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో భర్త మృతిచెందగా, భార్య గాయపడింది. ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నగరంలోని మధురానగర్‌లో నివాసం ఉంటు న్న గార మండలం శ్రీకూర్మం పంచాయతీ బుద్ధయ్యగారిపేట గ్రామానికి చెందిన కుందు సూర్యా రావు, భార్య సావిత్రి ద్విచక్ర వాహనంపై రామతీర్థం వెళ్లి స్వామివారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా.. హైదరాబాద్ నుంచి పశ్చిమబెంగాల్ వెళ్తున్న అంబులెన్స్ వెనుక నుంచి వస్తూ ఢీకొంది. ఈ ఘట నలో సూర్యా రావు (55), అతడి భార్య సావిత్రి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలు సుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయ పడిన వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ సూర్యారావు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వత్సవలస జాతరలో యువకుడి అదృశ్యం



అదృశ్యమైన రామప్రసాద్

పొందూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బాణాం గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు మక్క రామప్రసాద్ మూడురోజుల కిందట జరిగిన వత్సవలస యాత్రలో అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబసభ్యులతో కలిసి గార మండలం వత్సవలసలో జరిగిన రాజమ్మ జాతరకు వెళ్లిన రామప్రసాద్ కనిపించకుండా పోయాడు. యాత్రలో కుటుంబ సభ్యులు రామప్రసాద్ కోసం వెతికినా కనిపించలేదు. యువకుడు కొద్ది రోజులుగా మానసికంగా ఇబ్బందిపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. యువకుడి అదృశ్యంపై గార, పొందూరు పోలీస్ స్టేషన్‌లో యువకుడి తండ్రి రమణ ఫిర్యాదు చేశారు.

అప్పులబాధతో యువకుడి ఆత్మహత్య



మృతిచెందిన లక్ష్మణరావు

పొందూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఖాజీపేటకు చెందిన పల్ల లక్ష్మణరావు (45) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. ఆ అప్పుల భారం పెరిగి పోవడంతో ఆందోళనకు గురైన లక్ష్మణరావు బుధవారం రాత్రి గ్రామంలో ఉన్న బావిలో దూకేశాడు. ఆ బావిలో ఉన్న రాయి తలకు బలంగా తగిలింది. దీన్ని గమనించిన గ్రామస్థులు లక్ష్మణరావును బయటకు తీయగా.. అప్పటికే మృతిచెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహా శివరాత్రి రోజునే ఈ ఘటన చోటుచేసు కోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. లక్ష్మణరావు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోలీసులు తరలిం చారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● తొమ్మిది మందికి గాయాలు



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

పొందూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రెడ్డిపేట (పుల్లాజీపేట) గ్రామ సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో తొమ్మిది మంది ప్రయాణికులకు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాలకొండ నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు రెడ్డిపేట సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో బస్సు ముందుభాగం దెబ్బతింది. గాయపడిన ప్రయాణికులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాపాక కూడలిలో రోడ్డు ప్రమాదం

● ట్రాక్టర్ కిందపడిన వ్యక్తి.. నుజ్జునుజ్జయిన కాలు

పొందూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాపాక కూడలి వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి కాలు నుజ్జునుజ్జయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొంచాడ గ్రామానికి చెందిన పల్ల రాములు గురువారం సాయంత్రం రాపాక కూడలికి వచ్చాడు. పని ముగించుకున్న రాములు రోడ్డుపైకి రాగా.. అదే సమయంలో వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ చక్రం రాములు కాలుపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. తీవ్రంగా గాయపడిన రాములను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాములు భార్య సూరీడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

కుమారుడి మృతిపై నిజాలు బయటపెట్టాలి

● లోకేశ్ తల్లిదండ్రుల డిమాండ్



లోకేశ్(ఫైల్)

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తమ కుమారుడు ఆత్మహత్య చేసుకు నేంత పిరికివాడు కాదని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిజాలు బయటపెట్టాలని ఆ యువకుడి తల్లిదండ్రులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చినరావుపల్లి గ్రామానికి చెందిన అన్నెపు గణేష్, అమ్మాజమ్మ దంప తులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దవాడు సంతోష్, రెండో వాడు లోకేశ్. తండ్రి గణేష్ తాపీపని, తల్లి అమ్మాజమ్మ కూలిపనులు చేసు కుంటూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్నారు. చిన్న కుమారుడైన లోకేశ్ విజయ నగరంలో స్నేహితులతో కలిసి రూమ్‌లో ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతూనే మరోవైపు ఫిజికల్ ఫిటినెస్‌తో పాటు, కాంపిటేటివ్ పరీక్షలకు శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో అన్నయ్య సంతోష్‌కు లోకేశ్ ఉరిపోసుకుని చనిపోయాడని తన తమ్ముడి స్నేహితుల నుంచి ఫోన్ వచ్చింది. లోకేశ్ ఆత్మ హత్య చేసుకునేంత పిరికివాడు కాదని, దీనిపై నిజానిజాలు బయటకు తీయాలని తల్లిదండ్రులు గణేష్, అమ్మాజమ్మ కోరుతున్నారు. మరణం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించాలని లోకేశ్ తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతు న్నారు. గురువారం స్వగ్రామమైన చినరావుపల్లిలో లోకేశ్ అంత్యక్రియలు నిర్వహించారు.

హోమియో వైద్యంతో ప్రయోజనం

పాతపట్నం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ప్రయోజనం పొందవచ్చని డా.ఎస్.ఉమాగౌరి అన్నారు. పెద్దసరియాపల్లిలో తెంబూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హోమియోవైద్యంపై అపోహలు వీడాలన్నారు. ఈ సందర్భంగా 29 మందికి వైద్యసేవలు అందించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● భూ తగాదాలే కారణమా?



మువ్వా వాసుదేవరావు మృతదేహం

హరిపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మందస మండలం సాబకోట పంచాయతీ చొంపాపురం గ్రామ సమీపంలో మందస పట్టణానికి చెందిన మువ్వా వాసుదేవరావు(60) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చొంపాపురం గ్రామానికి వెళ్లే దారిలో మృతి చెందిన వాసుదేవరావును గ్రామస్థులు గురువారం ఉదయం గుర్తించి సమాచారం అందించారు. అప్పటికే ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు. కాగా ఇటీవల తండ్రి నుంచి వార సత్వంగా వంద లాది ఎకరాల భూమి మందస ప్రాంతంలో ఆక్రమణలకు గురైందని మృతుడు చేసిన ఫిర్యాదే ప్రాణాలను కోల్పోయి నట్లు చేసినందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారసత్వంగా వచ్చిన భూ ముల ఆక్రమణలపై ఇటీవల కలెక్టర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు వాసుదేవరావుతో పాటు అక్కచెల్లెళ్ల కుటుంబాలతో కలిసి డాక్యుమెంట్లతో వెళ్లి వినతిపత్రాలు అందించాడు. ఈ విషయంలో న్యాయం చేయాలని వేడుకున్నాడు. అధికారుల సూచనల మేరకు వాసుదేవరావు మందసకు మకాం మార్చాడు. రెవెన్యూ అధికారులు గత వారం రోజులుగా వివరాలు సేకరిస్తున్నారు. ఇంతలో వాసు దేవరావు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. తల వెనుక భాగం తోపాటు ముఖంపైనా గాయాలు ఉండడంతో.. ఇది ముమ్మాటికే హత్యేనని అతని అక్క లత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి మద్యం తాగే అలవాటుందని, దీని కోసం గిరిజన ప్రాంతానికి వెళ్లి మృతిచెందినట్లు పలువురు అనుమానిస్తున్నారు. మరి ఏది నిజమనేది దర్యాప్తులో తేలాల్సిందే. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

● నిందితుడ్ని అదుపులోకి తీసుకోకపోవడంపై ఆగ్రహం
● పోలీసు స్టేషన్‌ను ముట్టడించిన బారువ కొత్తూరు గ్రామస్థులు

సోంపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బారువ కొత్తూరు గ్రామస్థులు బారువా పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. వివరాల్లోకి వెళ్తే నాలుగు రోజుల కిందట గ్రామానికి చెందిన వలిశెట్టి తులసి.. తన తోటి ఉద్యోగి వేధింపులు తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై తులసి తండ్రి హేమరాజు బారువ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంతవరకు ఈ కేసులో ఎటువంటి పురోగతి లేకపోవడంతో ఆ గ్రామస్థులు గురువారం రాత్రి బారువ పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తోటి ఉద్యోగి వేధింపులు తాళలేక యువతి మృతి చెందితే పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ విషయంలో నిందితుడికి సహకరిస్తున్నారన్న అనుమానం వ్యక్తం చేస్తూ.. అతడ్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడ్ని విచ్చలవిడిగా వదిలేయడం ఎంతవరకు సమంజసమంటూ మహిళలు నిలదీశారు.

విషయం తెలుసుకున్న సీఐ మంగ రాజు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు జరుగుతోందని, పూర్తి ఆధారాలతో ఆదివారంలోగా నిందితుడ్ని అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వా రంతా శాంతించారు. సకాలంలో నిందితుడిపై చర్యలు తీసుకోకుంటే మళ్లీ పోలీసు స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.



పోలీసులను నిలదీస్తున్న బారువ కొత్తూరు గ్రామస్థులు

మా భూములకు నీరందడం లేదు

● రోడ్డుకు అడ్డంగా బైక్‌లు పెట్టి రైతుల నిరసన



గొట్టా బ్యారేజివద్ద అందోళనకుదిగిన రైతులు

హిరమండలం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలకు గొట్టా బ్యారేజీ దిగువకు నీటిని విడిచిపెట్టడం వల్ల వంశధార ఎడమ కాలువ ఆయకట్టు భూములకు నీరందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం రాత్రి బ్యారేజీ వద్ద రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలిపి నిరసన తెలిపారు. పింద్రువాడ, భగీరథపురం, మహాలక్ష్మీపురం, అంబావల్లి తదితర గ్రామాల రైతులు బ్యారేజి వద్దకు చేరుకొని కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సిబ్బంది మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యారేజి దిగువకు నీటిని విడిచిపెట్టామన్నారు. రైతులు మాట్లాడుతూ బ్యారేజి దిగువకు నీటిని విడుదల చేయడం వల్ల తాము పండిస్తున్న రబీ పంటలకు ఎడమ కాలువ ద్వారా నీరు అందకుండా పోతుందని, వెంటనే నదిలోకి నీటి విడుదల నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఇక్కడి నుంచి వెళ్లేదిలేదని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న హిరమండలం పోలీసులు ఘటనా ప్రదేశానికి వచ్చి నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. ఇంతలో అంబావల్లి నీటి సంఘం అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు అక్కడికి వచ్చి వంశధార ఈఈ ప్రదీప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈఈ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు చక్రతీర్థ స్నానాలకు నీరు విడిచిపెట్టడం జరిగిందన్నారు. బ్యారేజి వద్ద ప్రస్తుతం 0.06 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు. బ్యారేజి దిగువకు నీరు విడిచిపెట్టగా ఇంకా 0.05 టీఎంసీల నీరు ఉంటుందన్నారు. రైతులు వేసిన పంటలకు నీటిని విడిచిపెట్టేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. సహకరించాలని కోరగా రైతులు శాంతించి వెనుదిరిగారు.

టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలి



గుర్తింపు కార్డులను చూపుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల సభ్యత్వ నమోదున్ను పెద్ద ఎత్తున నమోదు చేసిన బూత్ ఇన్‌చార్జిలకు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలను అభినందించారు. నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు సూర్యనారాయణ, ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు పాల్గొన్నారు.

కొబ్బరి పీచు పరిశ్రమతో ఆర్థిక స్వావలంబన

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉద్దాన ప్రాంతంలో కొబ్బరి పీచు పరిశ్రమ ఏర్పాటు ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని నాబార్డు డీడీఎం కె.రమేష్‌కృష్ణ అన్నారు. రెయ్యిపాడులో హ్యూమన్ డెవలప్‌మెంట్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గంగపుత్ర వెజిటబుల్ ప్రొడ్యూసర్స్ కంపెనీని గురువారం ఆయన సందర్శించారు. కంబారాయుడిపేటలో ఇదివరకే ఏర్పాటు చేసిన కొబ్బరి పీచు ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. మహిళలతో మాట్లాడుతూ.. మహిళలు పెద్ద గ్రూప్‌గా ఏర్పడితే తాము ఆర్థిక సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మునుగపంట అధికంగా పండుతున్నందున మహిళలు మార్కెట్‌ను అభివృద్ధి చేస్తే మరింత లాభాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు



మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

పోలాకి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అధికారుల అనుమతులు లేకుండా మండల పరిషత్ అధీనంలో ఉన్న జీడి తోట వద్ద మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన జీడితోటలో మట్టి తవ్వకాలను పరిశీలించారు. మండల పరిషత్‌కు చెందిన సుమారు 100 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 50 ఎకరాలు మిగిలి ఉందని, ఈ నేపథ్యంలో జీడితోటకు కంచె ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది జీడితోట ఆక్రమణలు పరిశీలించి తనకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ బలగప్రకాష్, సచివాయల సిబ్బంది ఉన్నారు.

కిడ్నీ ఆసుపత్రికి డయాలసిస్ యూనిట్ల వితరణ



పలాస, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పలాస కిడ్నీ ఆసుపత్రికి గ్లో సంస్థ రెండు కిడ్నీ డయాలసిస్ యూనిట్లు వితరణగా అందించింది. ఈ మేరకు సంబంధిత యూనిట్లు గురువారం ఆసుపత్రికి చేరు కున్నాయి. వీటిని త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు గ్లో సంస్థ కార్యదర్శి, పలాస టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకన్న చౌదరి తెలిపారు. ప్రస్తుతం కిడ్నీ ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ యూనిట్లు బాధితులకు సరిపోకపోవడంతో ఈ అంశాన్ని ఇటీవల కలెక్టర్ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రస్తావించారు. దీనికి గ్లో సంస్థ స్పందించి యూనిట్లను అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు కొద్ది రోజుల వ్యవధిలోనే డయాలసిస్ యూనిట్లు అందించింది.

రోడ్డుపైకి ఆసుపత్రి వాడుక నీరు



ఆసుపత్రి నుంచి కోవెల వీధి రోడ్డుపైకి వచ్చిన మురుగు నీరు

నరసన్నపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆసుపత్రిలో వాడే వ్యర్థాల నీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం 100 పడకల ఆసుపత్రి కాలు వల నుంచి మురుగునీరు కోవెల వీధిలోని రోడ్డుపై ప్రవహించడంతో స్థానికులు దుర్గంధంతో తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి నుంచి వ్యర్థాలను వీధుల్లోకి విడిచిపెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.

న్యూస్ బాక్స్

నిమిషం ఆలస్యమైనా.. నో ఎంట్రీ

(ఐదో పేజీ తరువాయి)

మాత్రమే సమాధానాలు రాయాలి. ఆన్సర్ షీటుపై మతపరమైనవి, దేవుడి పేర్లు రాయకూడదు. బొమ్మలు వేయకూడదు. అలాగే పరీక్షా కేంద్రాలకు ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లరాదు.

● బార్‌కోడ్ (ఓఎంఆర్) షీటుపై అప్పటికే విద్యార్థి పేరు, రిజిస్టర్ నంబర్, సబ్జెక్టు, మీడియం, పరీక్ష కేంద్రం ముద్రించి ఉంటుంది. అందులో ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే ఇన్విజిలేటరుకు తెలియ జేయాలి. తరువాత అతనికి సంబంధించిన బార్‌కోడ్ షీటు అందజేస్తారు. బార్‌కోడ్ షీట్‌పై ఆన్సర్ బుక్‌లెట్ నెంబర్, రూమ్ నంబరు వేసి అభ్యర్థి సంతకం చేయాలి. తరువాతే ఇన్విజిలేటర్ సంతకం చేస్తారు. బార్‌కోడ్‌పై గీతలు గీయరాదు.

నేడు లుకలాంలో చక్రతీర్థం

నరసన్నపేట, ఫిబ్రవరి 27(ఫిబ్రవరి): లుకలాం గ్రామంలో ఉమాకామేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కన్నెపల్లి సాయి లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఏటా శివరాత్రి తరువాత రెండు రోజు ఉమా కామేశ్వర స్వామికి కామేశ్వరిపేట నుంచి లుకలాం నదీ తీరానికి తీసుకువచ్చి అక్కడ రుత్వికుల సాయంతో స్వామికి చక్రతీర్థ స్నానాలు చేపట్టడం ఆనవాయితీ అని తెలిపారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు



పొలంలో బోల్తా పడిన లారీ

కొత్తూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ బోల్తా పడింది. ఒడిశా నుంచి శ్రీకాకుళం వెళు తున్న లారీ వంశధార కాలువ మలుపు వద్ద ప్రమాదవశాత్తు పొలాల్లోకి దూసుకు పోయింది. అర్ధరాత్రి కావడంతో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ కేకలు వేసినా ఎవరూ స్పందించకపోవడంతో వైద్యం కోసం ఇబ్బందులు పడ్డారు. లారీ నుంచి అతి కష్టమ్మీద బయటకు వచ్చి గ్రామంలోకి వెళ్లి పిలువగా కొందరు స్థానికులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. చికిత్స నిమిత్తం కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. అయితే ఎవరికీ ఎటువంటి పెద్ద ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ధాన్యం కొనుగోలు చేపట్టాలి

నందిగాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పి.సాంబమూర్తి కోరారు. ధాన్యం కొనుగోలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని లక్ష్యాలు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేపట్టాలని కోరారు.

'ఆఫ్‌షోర్' కాలనీల్లో సదుపాయాల కల్పనకు కృషి

పలాసరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని జనసేన పార్టీ సమన్వయకర్త దుర్గారావు అన్నారు. టెక్కలిపట్నం వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల కాలనీలో గురువారం పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, రోడ్లు లేవని, రాత్రిపూట లైట్లు వెలగక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోన కృష్ణారావు, నందిగామ ధర్మారావు, దిలీప్ కుమార్, భద్ర రోహిత్ పాల్గొన్నారు.